# డీజీపీగా జితేందర్

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్ నియమితులయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీజీపీగా ఉన్న రవిగుప్తాను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. నూతన డీజీపీ జితేందర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు జితేందర్ డీజీపీ హోదాలోనే హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వంలో డీజీపీగా ఉన్న అంజనీకుమార్‌ను క్రమశిక్షణ చర్య కింద ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజున డీజీపీగా రవిగుప్తాను నియమించింది. నాటినుంచి డీజీపీగా రవిగుప్తా కొనసాగగా, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఆయనను బదిలీచేసి డీజీపీగా జితేందర్‌ను నియమించారు.

**సాధారణ రైతు కుటుంబం నుంచి..**

పంజాబ్ జలంధర్‌లోని సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్.. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. శిక్షణ తర్వాత ఏపీ క్యాడర్‌కు ఎంపికైన జితేందర్.. తొలి పోస్టింగ్‌లో నిర్మల్ ఏఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత బెల్లంపల్లి అదనపు ఎస్పీగా, నక్సల్స్ ప్రభావిత మహబూబ్‌నగర్‌తోపాటు గుంటూరు ఎస్పీగా సమర్థంగా విధులు నిర్వర్తించారు. డిప్యూటేషన్‌పై ఢిల్లీ సీబీఐలో, 2004-06 వరకు గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. అనంతరం విశాఖపట్టణం రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టారు. అప్పాలో కొంత కాలం పనిచేసి తెలంగాణ ఉద్యమం సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా, ఏపీ సీఐడీ, ఎంక్వయిరీ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా పనిచేశారు. తెలంగాణ శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీగా, జైళ్ల శాఖ డీజీగా కూడా పనిచేశారు.



డీజీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న జితేందర్



భద్రాద్రి జిల్లా వేలేరుపాడు-అశ్వారావుపేట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



గుమ్మడవల్లి హైస్కూల్‌కు తాళం వేస్తున్న పేరెంట్

# 200 మందికి ఇద్దరే టీచర్లు!

- ఉపాధ్యాయుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు
- మద్దతు పలికిన తల్లిదండ్రులు

అశ్వారావుపేట రూరల్, జూలై 10 : ఇద్దరు ఉపాధ్యాయులు 200 మందికి ఎలా బోధిస్తారంటూ ఆగ్రహించిన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి బుధవారం ఆందోళనకు దిగారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లిలో చోటుచేసుకున్నది. హైస్కూల్‌కు తాళం వేసి వేలేరుపాడు-అశ్వారావుపేట ప్రధాన రహదారిపై మూడు గంటలపాటు బైఠాయించారు. పాఠశాలలు పునఃప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదని, ఇక తమ చదువులు ఎలా సాగుతాయని విద్యార్థులు ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు గతంలో ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో భవనాలు నిర్మించినా.. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన ఎలా సాగుతుందని ప్రశ్నించారు. డీఈవో వెంకటేశ్వరాచారి ఫోన్‌లో గ్రామస్థులతో మాట్లాడారు. మూడు రోజుల్లో ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# నలుగురు టీచర్లు.. ఐదుగురే విద్యార్థులు

- విద్యార్థులులేని పాఠశాలలకు బదిలీలు
- రంగారెడ్డి విద్యాశాఖ నిర్వాకం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 10 (నమస్తే తెలంగాణ)/మాడ్గుల: రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంటే, రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం దొర్లపహాడ్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో మాత్రం విచిత్రకర పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ నలుగురు ఉపాధ్యాయులు ఉండగా, ఐదుగురే విద్యార్థులు ఉన్నారు. మూడో తరగతిలో ఒకరు, రెండు, నాల్గో తరగతుల్లో ఇద్దరు చొప్పున మొత్తం ఐదుగురు విద్యార్థులే ఉన్నారు. నిన్నటిదాకా ఈ పాఠశాలకు ఐదు పోస్టులు ఉండేవి. విద్యార్థుల సంఖ్య తగ్గిందంటూ అధికారులు ఒక పోస్టును రద్దు చేశారు. ప్రస్తుతం ఉన్న నలుగురు ఉపాధ్యాయుల్లో ఇద్దరు బదిలీపై రాగా.. వీరు బుధవారం పాఠశాలలో రిపోర్టు చేశారు. ఒకవైపు విద్యార్థులు లేరనే వాస్తవం మధ్యాహ్న భోజనం పథకం రికార్డుల్లో కనిపిస్తున్నా అధికారులు ఆ ఖాళీలను ఆన్‌లైన్‌లో బ్లాక్ చేయకుండా బదిలీపై ఇక్కడికి ఉపాధ్యాయులను పంపడాన్ని గ్రామస్థులే తప్పుపడుతున్నారు. గతంలో 300 మంది వరకు విద్యార్థులు ఉన్న ఈ పాఠశాల ఇప్పుడు నలుగురికే పరిమితమవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని పూర్వ విద్యార్థిని శిరీష ఆవేదన వ్యక్తంచేశారు. తాము ఉన్నత చదువులు చదివి, ఉద్యోగం సాధించి గ్రామాల్లోని పిల్లలకు చదువు చెప్పేందుకు వస్తే ఇక్కడ తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లల్ని పంపడం చాలా బాధాకరమని హెచ్‌ఎం సుజాత పేర్కొన్నారు.

# 15 మంది ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం 15 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీచేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రేవంత్ సర్కార్ అలా పోస్టింగ్ ఇస్తూనే మరోవైపు ఇలా స్థానచలనం కల్పిస్తున్నది. సీనియర్ ఐపీఎస్ అధికారులు గిరిధర్, తరుణ్‌జోషి తమ స్థానాల్లో కుదురుకోక ముందే మరోసారి బదిలీ చేసింది.

**రెండు నెలలు తిరగకుండానే బదిలీలు**

గత డిసెంబర్ 13న రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను మార్చి సుధీర్‌బాబును నియమించిన రేవంత్ సర్కార్ రెండు నెలలు తిరగకుండానే ఆయనను బదిలీచేసి తరుణ్‌జోషిని కమిషనర్‌గా నియమించింది. నాలుగు నెలలకే ఇప్పుడాయన స్థానంలో మళ్లీ జీ సుధీర్‌బాబును తీసుకొచ్చింది. దీంతో ఏడు నెలల్లో రాచకొండ కమిషనరేట్‌కు నాలుగో కమిషనర్ వచ్చినట్టయ్యింది. పరిపాలనా అనుభవం లేని రేవంత్‌రెడ్డి రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టాక జరుగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు చూసి రాష్ట్ర ప్రజలు, మీడియా, ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు.



సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర

**విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ఆనంద్..**

ఏసీబీ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్‌కు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| 1) మహేశ్‌భగవత్ | అదనపు డీజీపీ రైల్వే, రోడ్డు సేఫ్టీ | అదనపు డీజీపీ శాంతిభద్రతలు |
| 2) స్వాతిలక్రా | అదనపు డీజీ టీజీఎస్పీ బెటాలియన్స్ | అదనపు డీజీపీ హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ |
| 3) విజయ్‌కుమార్ | అదనపు డీజీపీ (ఓ) గ్రేహౌండ్స్, ఆక్టోపస్ | పోలీస్ పర్సనల్ అదనపు డీజీపీ (పోలీస్ సంక్షేమం, క్రీడల అదనపు బాధ్యతలు) |
| 4) సంజీవ్‌కుమార్ జైన్ | అదనపు డీజీ టీజీఎస్పీ బెటాలియన్స్ | |
| 5) స్టీఫెన్ రవీంద్ర | అదనపు డీజీపీ గ్రేహౌండ్స్ | |
| 6) సుధీర్‌బాబు | ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మల్టీజోన్-2 | రాచకొండ పోలీస్ కమిషనర్ |
| 7) డాక్టర్ తరుణ్‌జోషి | అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్ | |
| 8) ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి | ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, పర్సనల్ | ఐజీ మల్టీజోన్-1 |
| 9) కే రమేశ్‌నాయుడు | పోస్టు వెయిటింగ్ | ఐజీ రైల్వే, రోడ్డు సేఫ్టీ |
| 10) వీ సత్యనారాయణ | జాయింట్ సీపీ సీఏఆర్, హెడ్‌క్వార్టర్స్ | ఐజీ మల్టీజోన్-2 |
| 11) రక్షితమూర్తి | వనపర్తి జిల్లా ఎస్పీ | డీసీపీ సీఏఆర్, హెడ్‌క్వార్టర్స్ |
| 12) డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి | డీసీపీ సౌత్‌వెస్ట్ జోన్ | మెదక్ ఎస్పీ |
| 13) ఆర్ గిరిధర్ | డీసీపీ ఈస్ట్ జోన్ | వనపర్తి ఎస్పీ |
| 14) బీ బాలస్వామి | డీసీపీ ఈస్ట్ జోన్ | |
| 15) జీ చంద్రమోహన్ ఎస్పీ (ఎన్‌సీ) | డీసీపీ టాస్క్‌ఫోర్స్ రాచకొండ | డీసీపీ సౌత్‌జోన్ |

**ఇదేదో పిల్లల ఆటలా ఉన్నది.**

అధికారుల బదిలీలు చిన్నపిల్లల ఆటలాగా ఉన్నది. సీనియర్ అధికారులను కనీసం రెండు మూడేండ్లయినా ఒక పోస్టింగ్‌లో ఉంచడం ఆనవాయితీ. అప్పుడే సదరు అధికారి ఆ పోస్టులో కుదురుకొని కొంత మెరుగైన పని తీరు కనబరిచే అవకాశం ఉంటుంది. కానీ, రేవంత్ వచ్చాక అనేకమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఫుట్‌బాల్ ఆడినట్టు బదిలీలు చేస్తున్నారు. దీంతో ఆ అధికారులు ఎక్కడా కుదురుకోలేకపోతున్నారు. ఎప్పుడు ఉంటామో, ఎప్పుడు పోతామో తెలియని గందరగోళంలో ఆఫీసర్లు కూడా ఏ పనినీ సీరియస్‌గా తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో పాలన కూడా పూర్తిగా గాడితప్పింది. ఇది రేవంత్ అనుభవరాహిత్యం, నీడను కూడా అనుమానించే విశ్వాసరాహిత్యం తప్ప మరొకటి కాదు. దీనివల్ల తెలంగాణలో పాలన మాత్రం కుంటుపడుతున్నది.

–కొణతం దిలీప్,
బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్

# ఉపాధ్యాయుల కొరతపై పేరెంట్స్ ఆందోళన

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 10: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనబాట పట్టారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 324 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలో 122 మంది, ఉన్నత పాఠశాలలో 202 మంది ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్నారు. కేవలం ఐదుగురు ఉపాధ్యాయులతోనే పదోతరగతి వరకు విద్యార్థులకు బోధన చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నా.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహించారు. డీఈవో రమేశ్‌కుమార్ హామీతో ఆందోళన విరమించారు.

# గురుకుల బదిలీల్లో రచ్చ

మొదటిపేజీ తరువాయి...

బదిలీల ప్రక్రియ అంతా గందరగోళంగా కొనసాగుతున్నది. ప్రణాళిక అంటూ లేకుండా సొసైటీ ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా బదిలీలు నిర్వహిస్తున్నారంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీ ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

**సొసైటీ ఇష్టారాజ్యం**

సొసైటీ సాధారణ బదిలీల ప్రక్రియను ఇటీవలే ప్రారంభించగా.. మొదటి నుంచి 317 బాధితులకు న్యాయం చేస్తామని, స్పౌజ్, ఇతర మెడికల్ కేసులను పరిష్కరిస్తామని, అంతా కూడా ఆన్‌లైన్ ద్వారానే బదిలీలను చేపడతామని సొసైటీ అధికారులు ప్రకటించారు. కానీ, ఆచరణలో పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తుండటంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం అదనపు ఉపాధ్యాయులను బదిలీ చేయాల్సిన సందర్భంలో తొలుత సీనియర్ల అంగీకారం తీసుకోవాలి. బలవంతంగా బదిలీ చేయాల్సివస్తే జూనియర్లను మాత్రమే బదిలీ చేయాలి. కానీ సొసైటీ మాత్రం అందుకుపూర్తి విరుద్ధంగా ఏకపక్షంగా రాత్రికిరాత్రే సీనియర్ టీచర్లతో లిస్ట్ విడుదల చేసి, మరుసటి రోజే కౌన్సెలింగ్‌కు రమ్మని పిలవటంపై టీచర్లు నిప్పులు చెరుగుతున్నారు. 317 జీవో, స్పౌజ్ కేసులను కూడా సొసైటీ పరిగణనలోకి తీసుకోవటం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పష్టత ఇచ్చాక, అందుకు అనుగుణంగా చర్యలు చేపడతామని అధికారులు దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీల కోసం ముందుగా ప్రకటించిన మెరిట్ జాబితాలో పేర్లు ఉండగా, తాజాగా ప్రకటించిన మెరిట్ జాబితాలో లేవని మండిపడుతున్నారు. ఇప్పటికైనా పారదర్శకత పాటించాలని, సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రణాళిక లేకుండానే..**

సొసైటీ అధికారులు ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా, ఇష్టారాజ్యంగా బదిలీల ప్రక్రియను నిర్వహిస్తున్నారని ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిప్పులు చెరుగుతున్నారు. అన్ని సొసైటీలు, శాఖల్లో ఆన్‌లైన్ బదిలీలే జరుగుతుండగా, సోషల్ వెల్ఫేర్ సొసైటీ మాత్రం ఆఫ్‌లైన్‌కు మార్చటంపై అభ్యంతరాలు, అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారాభవన్‌లో బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ రెండు రోజులుగా కొనసాగుతున్నది. బుధవారం సైతం గ్రేడ్-2 ప్రిన్సిపాల్స్, డిగ్రీ కాలేజీ స్టాఫ్ మినహాయించి మిగతా అన్ని క్యాడర్లలో అవసరానికి మించి డిస్‌లొకేట్ అయినవారికి కౌన్సెలింగ్‌కు పిలిచారు. అందులో సొసైటీలకు సంబంధించి జూనియర్ అసిస్టెంట్లు కూడా ఉన్నారు. కానీ ఎక్కడా ఒక క్రమపద్ధతి లేకుండా అధికారులు కౌన్సెలింగ్‌ను ఇష్టారాజ్యంగా నిర్వహించటంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రోడ్లవెంట, చెట్ల కింద ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గంటల తరబడి పడిగాపులు కాశారు. చంటిపిల్లలతో వచ్చిన మహిళా టీచర్లు, దివ్యాంగ టీచర్ల అవస్థలు అంతాఇంతాకాదు. కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ పొందిన సిబ్బందికి పోస్టింగ్స్ ఆర్డర్స్‌ను ఇవ్వకుండానే, తర్వాత పంపిస్తామంటూ సొసైటీ అధికారులు చెప్పడం కొసమెరుపు.



బుధవారం బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన గురుకుల బదిలీల ప్రక్రియకు హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు



చిన్నారికి పాలుపడుతున్న ఓ ఉద్యోగి తల్లి

**రాత్రికి రాత్రే మారిన జోన్లు**

బదిలీలకు ప్రకటించిన ఖాళీల జాబితా తప్పుల తడకగా ఉన్నదని టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని ఖాళీలను చూపించటం లేదని మండిపడ్డారు. ముందుగా ఒక జాబితాను ప్రకటించి, తాజాగా మరో జాబితాను విడుదల చేయటంపై నిప్పులు చెరిగారు. అందులోనూ రాత్రికి రాత్రే జోన్లు మారిపోయాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన టీచర్లు.. హాల్‌లోనే కౌన్సెలింగ్‌ను అడ్డుకొని 'వీ వాంట్ జస్టిస్' అని ఆందోళన చేపట్టారు. దీంతో ఉన్నతాధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు రంగంలోకి దిగారు. 'గంట నుంచి చూస్తున్నాం. ఆందోళన చేసే వాళ్లు హాల్ నుంచి బయటకు వెళ్లిపోండి. లేదంటే బలవంతంగా పంపించేస్తాం' అని పోలీసులు బెదిరింపులకు దిగారు. పోలీసుల తీరుపై భగ్గుమన్న టీచర్లు.. బదిలీ కోసం వచ్చిన ఉపాధ్యాయులను పోలీసులతో బెదిరిస్తారా అని సొసైటీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన ఉధృతం చేయటంతో ఎట్టకేలకు దిగొచ్చి ఉపాధ్యాయులు కోరిన ఖాళీల జాబితా చూపుతూ కౌన్సెలింగ్ ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 317 డిస్‌లొకేట్ టీచర్లకు న్యాయం చేయటంతోపాటు, వేకెన్సీ జాబితాలలో తప్పులను సరిచేశాకే బదిలీలు నిర్వహించాలని పట్టుబట్టారు. అర్ధరాత్రి దాటినా ఉపాధ్యాయుల ఆందోళన కొనసాగుతూనే ఉన్నది.

**10వ తారీఖు వచ్చినా జీతాలు పడలేదు**

జూలైలో 10వ తేదీ గడిచినా ఇప్పటికీ వేతనాలు వేయలేదని సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని సొసైటీల్లో ముందుగానే వేతనాలను చెల్లిస్తున్నా, తమ సొసైటీలో మాత్రం ప్రతి నెలా ఇదే పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. సొసైటీ ఉన్నతాధికారుల అలసత్వం వల్లే ఇదంతా జరుగుతున్నదని మండిపడుతున్నారు. వేతనాలను ఒక నిర్ణీత తేదీ లేకుండా ప్రతి నెలా ఏదో ఒక తేదీన వేస్తున్నారని, ఫలితంగా సిబిల్ స్కోర్‌పై తీవ్ర ప్రభావం పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## అంతర్గత బదిలీలతో ముందే సర్దుకున్నారు!

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్ శాఖలో బదిలీలకు కొందరు సీనియర్ మండల పరిషత్ అధికారులు (ఎంపీవోలు) కొత్త భాష్యం చెప్పారు. ఈ బదిలీలను ముందే ఊహించి అంతర్గత బదిలీలతో సర్దుకున్నారు. మల్టీ జోన్ పోస్టులకు సంబంధించిన బదిలీల నుంచి తప్పించుకొని తమకు అనువైన చోట తిష్ఠవేశారు. మల్టీ జోన్ పోస్టుల్లో ఉన్న వీరు వివిధ కారణాలను చూపి ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాల్లోనే ఇతర మండలాల్లోకి బదిలీ చేయించుకున్నారు. దీంతో ప్రస్తుత సాధారణ బదిలీల్లో జూనియర్ ఎంపీవోలు అన్యాయానికి గురవుతున్నారు. వారంతా ఇతర జిల్లాలకు, మారుమూల ప్రాంతాలకు బదిలీ కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సీనియార్టీ జాబితా ఆధారంగా ఎంపీవోలను బదిలీ చేయాలి.. దీంతో ముందు సీనియర్లనే బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ, ప్రస్తుతం బదిలీలకు అర్హులైన ఎంపీవోల జాబితాలో నల్లగొండ జిల్లాకు చెందిన ఒక్కరు కూడా లేరు. ఆ జిల్లాలో నిరుడు ఫిబ్రవరిలోనే అంతర్గత బదిలీలు చేపట్టడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. ఇదే తరహాలో భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, నారాయణపేట, జగిత్యాల, ములుగు, హనుమకొండ, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లోనూ అంతర్గత బదిలీలు జరిగినట్టు గుర్తించారు. దీంతో 5 నుంచి 8 ఏండ్ల సీనియార్టీ ఉన్న ఎంపీవోలు ప్రస్తుత సాధారణ బదిలీల జాబితాలో లేకుండా పోయారు. కేవలం 4 ఏండ్ల నుంచి సర్వీస్‌లో కొనసాగుతున్న జూనియర్ ఎంపీవోలను మాత్రమే ఈ జాబితాలో చేర్చారు. దీనిపై జూనియర్ ఎంపీవోలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో జరిగిన అంతర్గత బదిలీలను రద్దుచేసి, సీనియార్టీ ప్రకారం బదిలీలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## వెబ్ కౌన్సెలింగ్‌తో బదిలీలు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): సాంకేతిక కళాశాల, ఇంటర్ కళాశాలల్లోని ఉద్యోగులు, సిబ్బందిని వెబ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నది.

# బీసీ సంక్షేమశాఖలో ఇష్టారాజ్యంగా పోస్టింగ్స్!

- అర్హతలు లేకున్నా అదనపు బాధ్యతలు
- బదిలీల్లో నిబంధనలు బుట్టదాఖలు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారుల తీరుపై సొంత సిబ్బంది విమర్శలు గుప్పిస్తున్నారు. నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా పోస్టింగ్స్ ఇస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఇటీవల బీసీ సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్, ఓ జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఉద్యోగ విమరణ చేశారు. ఆ స్థానంలో ఇన్‌చార్జిగా ఇప్పటికే అనేక విమర్శలు ఎదుర్కొంటున్న అధికారిని నియమించడం చర్చనీయాంశంగా మారింది. సీనియర్లు, జూనియర్లనే వివాదానికి తెరతీసింది. వాస్తవంగా డీబీసీడీవో పోస్ట్ డీడీ (డిప్యూటీ డైరెక్టర్) క్యాడర్‌కు సంబంధించినదని, అందుకు విరుద్ధంగా ఏడీ (అసిస్టెంట్ డైరెక్టర్)ను ఆ స్థానంలో నియమించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు ఏడీ ఇప్పటికే రెండు కార్పొరేషన్లకు ఎండీగా, మరో కీలకమైన పథకానికి సెక్షన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. తనకు అదనపు బాధ్యతలు వద్దని సదరు అధికారే మొత్తుకుంటున్నా ఆయనకు బలవంతంగా బాధ్యతలను అప్పగించడం కొసమెరుపు. ఇదిలాఉంటే గురుకుల సొసైటీకి కార్యదర్శిగా పనిచేసిన బీసీ సంక్షేమశాఖ ఏడీ (అడిషనల్ డైరెక్టర్) మల్లయ్యభట్టు.. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఇటీవలనే తిరిగి ఆయనను సొంతశాఖకు పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కానీ 10 రోజులు గడిచినా ఆయనకు ఎలాంటి బాధ్యతలను అప్పగించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే సొసైటీ ఉన్నతాధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని సిబ్బంది విమర్శలు గుప్పిస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా కామన్ సీనియార్టీ..!**

హాస్టల్ వెల్ఫేర్ అధికారుల బదిలీల్లో కూడా ఓ కీలక అధికారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అధికారులు మండిపడుతున్నారు. సర్వీస్ నిబంధనలను మారుస్తూ సీనియార్టీ లిస్టును ప్రకటించకుండా జాప్యం చేస్తున్నారని హెచ్‌డబ్ల్యూవోలు నిప్పులు చెరుగుతున్నారు. చివరి నిమిషంలో సీనియార్టీ లిస్టు విడుదల చేసి, సమయమివ్వకుండా హడావిడిగా ఐచ్ఛికాలను తీసుకునే కుట్రలకు తెరలేపారని మండిపడుతున్నారు. వాస్తవంగా బీసీ సంక్షేమశాఖలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి గ్రేడ్-2 ఉద్యోగులకు సంబంధించి ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ అనే రెండు విభాగాలున్నాయి. ఇందులోనూ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్‌లో బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి గృహాలతో మొత్తంగా నాలుగు ప్రత్యేక విభాగాలున్నాయి. ఈ నాలుగు విభాగాల్లో ఖాళీల భర్తీకి విడివిడిగా ప్రత్యేక రోస్టర్ విధానం ప్రకారం నియామకాలు, బదిలీలను నిర్వహిస్తున్నారు. 2022లో మార్చిన రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా విడుదల చేసిన 317 జీవో ప్రకారం చేపట్టిన బదిలీల ప్రక్రియలోనూ సీనియర్టీలిస్టు ప్రకారం బదిలీలు చేపట్టారు. ఇప్పుడు గతంలో వలె కాకుండా ప్రీ మెట్రిక్‌బాయ్స్, పోస్ట్ మెట్రిక్ బాయ్స్ వసతి గృహాలను కలిపి ఒక కామన్ లిస్టు, ప్రీ మెట్రిక్ గర్ల్స్, పోస్ట్ మెట్రిక్ గర్ల్స్‌లను కలిపి మరో కామన్ లిస్టు తయారు చేసి బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని చూస్తున్నారని హెచ్‌డబ్ల్యూవోలు వాపోతున్నారు. దీనివల్ల వల్ల తాము తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని ప్రీ మెట్రిక్ వసతి గృహ సంక్షేమ అధికారులు ఆందోళనకు గురవుతున్నారు.

## బీసీ స్టడీసర్కిల్‌కు రూ.6కోట్లు

హైదరాబాద్, జూలై10 (నమస్తే తెలంగాణ): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌ల నిర్వహణకు ప్రభుత్వం రూ.6.25కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

**లోకం పోకడ**




## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 35.6°c | 25.1°c |
| రంగారెడ్డి | 34.1°c | 21.4°c |
| ఖమ్మం | 34.0°c | 25.0°c |
| మహబూబ్‌నగర్ | 33.5°c | 24.2°c |
| కరీంనగర్ | 33.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 32.6°c | 24.0°c |
| మెదక్ | 32.2°c | 23.0°c |
| వరంగల్ | 32.0°c | 25.0°c |
| నల్లగొండ | 32.0°c | 22.2°c |
| నిజామాబాద్ | 31.0°c | 24.0°c |

## 10 జిల్లాలకు ఎల్లో అలర్ట్

- మరో రెండు రోజులు భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బలమైన నైరుతి రుతుపవనాలకు తోడు.. సముద్ర మట్టానికి 3.1కి.మీ. నుంచి 7.6 కి.మీ. మధ్యలో ఆవర్తనం కొనసాగుతున్నదని వెల్లడించారు. ఏపీ తీరం వద్ద పశ్చిమ-మధ్య బంగాళాఖాతం ఆనుకొని కేంద్రీకృతమైన ఆవర్తనం బలహీనపడిందని, దీని ప్రభావంతో తెలంగాణలోని 10 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. గంటకు 30-40కి.మీ. వేగంతో గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉన్నదని చెప్పారు. హైదరాబాద్‌లోనూ భారీ వర్షం కురిసే అవకాశముందని, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా బుర్గంపాడులో బుధవారం అత్యధికంగా 6.40 సెం.మీ వర్షం కురిసింది.

## మేడిగడ్డ బరాజ్‌కు పెరిగిన వరద

- ఇన్‌ఫ్లో 41,500 క్యూసెక్కులు

మహదేవపూర్/కాళేశ్వరం/కన్నాయిగూడెం, జూలై 10: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలోని లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌కు వరద ప్రవాహం పెరుగుతున్నది. 16.17 టీఎంసీ నిల్వ సామర్థ్యం కలిగిన బరాజ్‌కు మంగళవారం ఇన్‌ఫ్లో 35,200 క్యూసెక్కులు రాగా, బుధవారం 41,500 క్యూసెక్కులకు పెరిగింది. బరాజ్‌లో మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదను దిగువకు వదులుతున్నారు. రివర్ బెడ్ లెవల్ సముద్ర మట్టానికి 88 మీటర్లు కాగా.. ప్రస్తుతం ప్రవాహం 89.90 మీటర్ల ఎత్తులో కొనసాగుతున్నది. అంటే.. 1.90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నది. ప్రాణహిత జలాల రాకతో కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం పెరుగుతున్నది. బుధవారం సాయంత్రం వరకు కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద 45 వేల క్యూసెక్కులతో 5.05 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నది. ములుగు జిల్లా తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. బరాజ్ వద్ద 64,350 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నట్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న వరదను 52 గేట్లను ఎత్తి దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం 73.40 మీటర్ల ఎత్తుకు చేరింది.

## అర్జెంట్ ఉన్నా.. ప్లాస్టిక్ బాటిల్ తీసుకెళ్లొద్దు

- బహిర్భూమికి వెళ్లిన వ్యక్తికి రూ. 2వేలు ఫైన్

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): ప్రయాణంలో ప్రకృతి పిలిస్తే పరుగెత్తకుండా ఎవరుంటారు? అర్జెంట్‌గా వస్తుందని ప్లాస్టిక్ బాటిల్‌తో పనికానిచ్చేసిన ఓ వ్యక్తికి అటవీ అధికారులు షాక్ ఇచ్చారు. అడవిలోకి ప్లాస్టిక్ బాటిల్‌ను తీసుకెళ్లినందుకు ఏకంగా రూ. 2వేలు జరిమానా విధించారు. మహారాష్ట్రకు చెందిన దినేశ్ మంగళ్ మంగళవారం శ్రీశైలం రోడ్డు వెంట బైక్‌పై వెళ్తుండగా అర్జెంటుగా ప్రకృతి పిలిచింది. రోడ్డు పక్కన బండి ఆపేసి .. వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ బాటిల్ తీసుకుని తుప్పల చాటుకెళ్లి భారం దించేసుకున్నాడు. హమ్మయ్యా.. అనుకునేలోపే అటవీ అధికారులు ప్రత్యక్షమయ్యారు. అడవిలోకి ప్లాస్టిక్ వాటర్ బాటిల్ తీసుకెళ్లినందుకు తిట్లతోపాటు .. రూ.2వేల ఫైన్ కూడా వేశారు. ఫారెస్ట్ అధికారులు ఇచ్చిన ట్విస్ట్‌తో.. అవాక్కవటం బాధితుడి వంతైంది. శ్రీశైలం ఫారెస్ట్ (అమ్రాబాద్ ఫారెస్ట్) టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కావటంతో .. ఎక్కడ పడితే అక్కడ బండ్లు ఆపనివ్వరు. పైగా.. ఈ అడవిలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్లాస్టిక్ బాటిల్‌ను అడవిలోకి తీసుకెళ్లినందుకే ఫైన్ వేసినట్టు పోలీసులు తెలిపారు.